


వీరభద్రరావు పమ్మి

నిర్మలా పురం పంచాయతీ ఎన్నికలు జరిపించమని ఘనత వహించిన ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాగానే చాలా మంది లాగ నేను గతుక్కు మనలేదు. కాని మాకిచ్చే ట్రైనింగ్ పూర్తయాక మా జిల్లా కలెక్టరు గారు నన్ను వేరే గదిలోకి పిల్చి,

"చూడండి... నిర్మలా పురం చాలా ప్రమాద కరమైన ఊరు. ప్రతి ఎలక్షన్లకి అక్కడ ఇద్దరు ముగ్గురు బలి అవుతుంటారు. మీరు అతి చాకచక్యంగా 'రిస్కు' లో పడకుండా పని ముగించుకుని బయట పడాలి. మా ఆందోళనంతా ఆ ఊరి గురించే — మా సహకారం పూర్తిగా మీ కుంటుంది." అని చెప్పినప్పుడు మాత్రం నిజంగానే ఆందోళనపడ్డాను ఎలక్షన్ డ్యూటీ అనగానే ఎందుకు చాలామంది ఉద్యోగస్థులు భయపడి తప్పించుకో జూస్తారో అప్పుడర్థమైందినాకు.....

నాకిచ్చిన పోలీసు బలగాన్ని, స్టాఫ్ని తీసుకుని రూలు ప్రకారం ముందురోజు రాత్రి నేను నిర్మలాపురం చేరుకున్నాను. మిగతా వాళ్ళందరికీ భోజన వసతి సదుపాయాలన్నీ చేయించి నేను విమల వాళ్ళింటికి వెళ్ళాను. ...

విమల నాకు మరదలౌతుంది. వాళ్ళాయన రాంబాబు నిర్మలా పురం హైస్కూల్లో సైన్సు టీచరుగా పని చేస్తున్నాడు. విమల ఎన్నాళ్ళ నుంచో నన్ను వాళ్ళింటికి రమ్మనడం, నేను వెళ్ళలేక పోవడం జరుగుతూంది. ఈ రకంగా నైనా వాళ్ళింటికి వెడుతున్నం

దుకు నాకు సంతోషమేసింది. ఊహించని నా రాకకు విమల ఆశ్చర్యాన్ని, అంతకు మించి ఆనందాన్ని ప్రకటించింది.

విషయమంతా చెప్పేక-

"ఒరే బావా! నిన్ను తీసుకొచ్చి ఈమంత్ర గృహంలో పడేసారేమిటిరా.. ఇంటింటికి ఆరు పార్టీలు, ఎనిమిది గ్రూపులూ..." అంది.

నా ఆందోళన మరి కాస్త ఎక్కువయ్యింది.

సమర్థవంతంగా ఆ ఊరిఎలక్షన్లు నిర్వహించి బయట పడాలంటే... ఆ వూరి రాజకీయ చరిత్ర తెలుసుకోవడం మంచి దని పించింది.

అదే అడిగాను వాళ్ళిద్దర్నీ...

నిర్మలాపురం ఒక మేజర్ పంచాయతీ.

ఆ వూళ్ళో ఒక హైస్కూలు. ఒక చిన్న ఆసుపత్రి. లైబ్రరీవగైరా సదుపాయాలన్నీ ఉన్నాయి. ఆ వూరినిండా బాగా డబ్బున్న రైతులు చాలామంది వున్నారు. స్వతంత్రం రాక పూర్వం నుంచి ఆ ఊరు రాజకీయంగా బాగా ఎదిగింది. పదేళ్లు నిండిన ప్రతికుర్రాడు. రాజకీయాలు గురించి రాజకీయ ఎత్తుల గురించి మాట్లాడుతారు. ఆ వూళ్ళో, ప్రస్తుతం రెండు ముఖ్యమైన వర్గాలున్నాయి. ఎన్నాళ్ళనుంచో ఆ వూళ్ళో సర్పంచ్‌గా వుంటున్న నరసింహం ఒక వర్గానికి నాయకుడు. ఆయన మాటకు ఎదురు నిల్చిన వాడెవ్వడూ ఆ ఊళ్ళో బతికి బట్టకట్టలేడు. ఆయన చేతలకు ఎదురుతిరిగిన ఎంతో మందికి ఆ వూరి చెరువు నీళ్ళు తాగే యోగం లేకుండాపోయింది. ఆయన దౌర్జన్యం, జులుం, హింసాప్రవృత్తిని సహించలేని వాళ్ళంతా కల్సి ఒక వర్గం కట్టారు. ఆ వర్గం ఆయన వర్గంతో పోటీచేస్తోంది. నరసింహంగారి పెద్దబ్బాయి వెంకటరత్నం దానికి నాయకుడు. ఆయన రెండో కొడుకు కూడా తండ్రికి ఎదురుతిరిగి అన్నగార్కి చేయూత నిస్తున్నాడు. అంటే ఆ ఊరి ఎన్నికలు తండ్రీకొడుకులమధ్య జరుగుతున్నాయి. నరసింహంగారి భార్య మీనాక్షమ్మకూడా ఒకవార్డులో ఆడమెంబరుగా భర్త తరపున పోటీచేస్తోంది. కొడుకువెళ్ళి తల్లిని ఉపసంహరించుకోవల్సిదిగా కోరాడట. కాని ఆమె అందుకు ఒప్పుకోలేదట. ఇది నాకు మరీ ఆశ్చర్యం కల్గించిన విషయం ఎందుకంటే.

ఈ ఎలక్షన్ల మూలంగా ఎన్నో అవిభక్త కుటుంబాలు చిన్నాభిన్నమై పోవడం, అన్నదమ్ముల మధ్య, భార్యాభర్తల మధ్య, స్నేహితులమధ్య, ఆత్మీయుల మధ్య అనుబంధాలు, అనురాగాలు మాసిపోయి వాటి స్థానంలో కక్షలు, కార్పణ్యాలుపెరిగి మానవత్వానికే తీరని మచ్చగా నిలిచి పోవడం నిజంగా దారుణ

మైన విషయం. ఐదేళ్ళ కోసారి మన ప్రతినిధుల్ని ఎన్నుకుని మనల్ని మనం పరిపాలించుకోడాన్కి జరిగే ఈ ఎన్నికలు ..మనిషిలోని మానవత్వాన్ని నశింపజేసి రాక్షసత్వాన్ని పురికొల్పుతున్నాయి.

విమల, రాంబాబు అన్ని విషయాలు చెప్పారు నాకు.

"నీ డ్యూటీ నువ్వు చెయ్యి బావా ! ధైర్యంగా ఉండు. నీకేమి కాదు " అంది విమల చివరగా.

"అబ్బే నాకెందుకే భయం"అన్నానే కాని - ఆ రోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు.

బాధగా తెల్లవారింది.

కాలకృత్యాలు తీర్చుకుని డ్రెస్‌వేసుకుని బయల్దేరుతుంటే "గుడ్ లక్" అంటూ కాఫీ ఇచ్చింది నిర్మల.

ఎన్నికల ప్రదేశం...ఆ వూరి హైస్కూలు.

ఆ చుట్టు ప్రక్కలంతా చాలా హడావుడిగా వుంది.

ఆ రోజు ఎన్నికల జాతర.

ఆరువేలమంది ప్రజానీకం ఐదేళ్ళపాటు తమని పాలించే ప్రభువులను నిర్ణయించేరోజు .... కులీనులకు విలాసమైనరోజు .... కడుపునిండిన వాళ్ళకి కార్పణ్యసాధనకొక సాధనం.దొక్కలు మాడి పూరి గుడిసెల్లో శిథిలమౌతున్న సజీవ అస్థిపంజరాలకు ప్రాణ సంకటం ఆశలు చావని మధ్య తరగతి ప్రజల ఆశయాలకు సమాధి.అదొకరకమైన బలి వితర్ది. పతాకాల్లేని పార్టీలు, ఉద్దేశ్యాలు శూన్యం ఆదర్శాలు అసలే లేవు. మెజారిటీ కులం మైనారిటీ కులం. కులాల మధ్య చీటలు. ఒక వీధిలో అనేక చీలలు ఒక కుటుంబంలో చీలికలు. ఒక 'దాంపత్యంలోపగుళ్ల. వీటన్నిటికి కారణభూతమై ప్రజాస్వామ్యం పెను భూతమైంది, పంచాయతీల స్వరూపంలో. మనిషి మనిషిని నమ్మడు. ఒక వర్గం మరో వర్గాన్ని నమ్మను. ఒక మనిషి రాకపోకలపై మరో మనిషినిఘా.ఒకరి స్వేచ్ఛపై మరొకరి అజమాయిషీ. వీళ్ళలో వీళ్ళకి సహజీవనం లేదు. వారి ఇంటి మీద కాకి వీరి ఇంటిమీద వాలదు. వీరి కుక్క వారింటి ముందు మొరగడాన్కి వీల్లేదు. గ్రామాల్లో రాజకీయాలు ఇలా 'మనిషిని' మరో మనిషి నుంచి దూరం చేస్తున్నాయి. అక్కడ జరిగే సర్పయాగానికి నేను పురోహితుణ్ణి.

ఇరువర్గాలవాళ్లు కాళ్ళరిగేటట్టు తిరిగేస్తున్నారు. మధ్యలో తేలిపోయేపరాన్న భుక్కులు కొందరైతే, భజనగాళ్ళు కొందరు. ఫలనా వార్డులో ఫలానావారికి ఫలనా మెజారిటీ వస్తుందని ఒకడు చిలక జోస్యము చెబుతున్నాడు.

"మావోడు పెసిడెంటు కాకపోతే నాకున్న పదెకరాలు రాసిత్తాను. పందెం

కాసుకో" అంటూ మీసం మెలేస్తున్నాడు మరొకడు.

మరో అరగంటలో పోలింగ్ మొదలవుతుందనగా ఒకతను నా దగ్గరకు వచ్చాడు. కాస్త చదువుకున్న వాడిలాగే ఉన్నాడతను. వినయంతో కూడిన పౌరుషం, స్వాభిమానంతో కూడిన పట్టుదల అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి తను "వెంకటరత్నం" నాకు పరిచయం చేసుకున్నాడు. అతనొక వర్గానికి నాయకుడు.

"అయ్యా! అవతలి వర్గం వాళ్ళు మిమ్మల్ని బెదిరించాలని, బెదిరించాలని ఆ రకంగా తమ ఇష్టంవచ్చినట్లు ఓట్లు పోల్ చేయించుకోవాలని చూస్తారు మరేమీ భయపడకండి. మీకు అండగా నేనున్నాను. అన్నీ న్యాయంగా జరిపించండి. మీరు వాళ్ళతో కుమ్మక్కయి మీ ఇష్టం వచ్చినట్లు పోలింగ్ జరిపిస్తే మాత్రం మేం చూస్తూ ఊరుకోలేం ఇంతకన్నా మీకేం చెప్పినా బాగుండదు. సెలవ్" అని వెళ్ళిపోయాడు. అతను నన్ను హెచ్చరించడానికి వచ్చాడో, ధైర్యం చెప్పడానికొచ్చాడో నాకర్థం కాలేదు.

రెండు మూడు గలాటాలు మినహా మిగతా పోలింగంతా ప్రశాంతంగానే సాగిపోయింది. మధ్యాహ్నం ... నరసింహం తరపు వాళ్ళు తమ వర్గపు ఓటర్ని దాచేశారని వెంకటరత్నం వచ్చి ఫిర్యాదు చేసాడు. డ్యూటీపై నున్న ఎస్. ఐ. వెళ్ళి విడిపించుకొచ్చాడు. అది జరిగిన కాస్సేపటికి.

"మీ కనవసరమైన ఇనయల్లో ఏలు పెడితే బాగుండదు." అని వెళ్ళిపోయాడొక ఆజానుబాహుడు

ఇంకే రకమైన గొడవలు లేకుండానే పోలింగ్ పూర్తయింది. ఓట్లలెక్కింపు మొదలెట్టాం.

పదకొండు వార్డుల లెక్కింపు ప్రశాంతంగానే సాగిపోయింది.

నరసింహం, ఆయన భార్య మీనాక్షమ్మ, కొడుకు వెంకటరత్నం గెలుపొందిన మెంబర్లలో వున్నారు.

సర్పంచ్ ఎన్నిక జరగడానికి ఇంకొంత టైముంది...

అదే ప్రమాదకరమైన సమయం.

ఒకరి తరపు మెంబర్లను మరో వర్గం వాళ్ళు దాచెయ్యడానికి, బెదిరించడానికి, ఆశలు చూపించి తిప్పుకోడానికి ఆఖరికి కొనెయ్యడానికి అప్పుడే ప్రయత్నాలు ఉధృతంగా సాగుతాయి.

నాకో విచిత్రమైన విషయం తెల్సిందప్పుడే.

మెంబర్లుగా ఎన్నికైన పదకొండు మందిలోను ఆరుగురు నరసింహం వర్గానికి చెందినవాళ్ళు.

మిగతా ఐదుగురు వెంకటరత్నం వర్గానికి చెందినవాళ్ళు.

వెంకటరత్నం వెళ్ళి తల్లిని తనకు ఓటు వెయ్యవల్సింది గాను, తనను సర్పంచ్‌గా ఎన్నుకోవల్సిందిగాను కోరాడట..

ఈ గాలి వార్త నా చెవిని పడింది. ఆమె ఒప్పుకోలేదని కూడా అనుకుంటున్నారు..

పరిస్థితిని తెలుసుకుంటున్నానేకాని, అనవసరమైన వివరాల జోలికి పోలేదు.

కాని... ఆ విధ మానసికావస్థను తలచుకుంటే జాలేసింది..

ఒక పక్క కట్టుకున్న భర్త...తనను ఎలక్షన్లో నిలబెట్టిన అతని వరం...

మరోపక్క కొడుకులు..వాళ్ళనమ్ముకున్న ఆదర్శాలు.

తను ఇద్దరిలో ఎవరికి ఓటువేస్తే వారు సర్పంచ్ అవుతారు

నిజంగా అలాంటి పరిస్థితి ఏ స్త్రీకైనా జీవన్మరణ సమస్యే..

సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహించాను.

గొడవేమీ లేకుండా జరిగిపోయింది.

ఫలితం ప్రకటించాను..

నేనే ఆశ్చర్యపోయాను.

నరసింహం గార్కి ఐదు ఓట్లు మాత్రమే వచ్చాయి.

వెంకట రత్నం ఒక ఓటు మెజారిటీతో సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు.

ఇది ఖచ్చితంగా అతని తల్లి చలవే అయ్యుంటుంది,

ఆమెలోని మాతృత్వమే అలా చేయించిందో-

అతని ఆదర్శాలు ఆమెని ఆకర్షించాయో.

ఫలితం ప్రకటించేసరికి వెంకట రత్నం ఆనందానికి అవధిలేదు.

వెంటనే అక్కడున్న తల్లికాళ్ళకు మొక్కాడు.

నరసింహం మాత్రం ఏం మాట్లాడకుండా బైటకి వెళ్ళిపోయాడు.

వెంకట రత్నం నా దగ్గరకు వచ్చి ఆప్యాయంగా చేయి కలుపుతూ.

"రేపుదయం మీరు మా ఇంట్లో భోంచేసి వెడితే చాలా సంతోషిస్తాను" అన్నాడు.

"సారీ! రేప్రొద్దునే నేను వెళ్ళిపోవాలి." అన్నాను.

బైట ఉన్న జనం అంతా అతనికి 'జై' కొట్టారు.

అతను హడావుడిగా తన జనంతో బాటు ఊరేగడానికి వెళ్ళిపోయాడు.

నేను విమల వాళ్ళింటికి వెళ్ళేసరికి. కాస్త పొద్దుపోయింది.

విమల, రాంబాబు భోం చెయ్యకుండా నా కోసం వెయిట్ చేస్తున్నారు

"చూశావే విమలా!... మీ ఊళ్లో హత్యలు, రక్తపాతం — గొడవలు, దొమ్మీలు జరక్కుండా ఎలక్షన్లు జరిపించిన ఘనత మొదటి సారిగా నాకే దక్కింది—" అన్నాను.

"నాకు తెలుసుగా బావా!— నువ్వు సాధించగలవ్" అని ఆమె అన్నప్పుడు నేను గర్వంగా ఫీలయ్యాను.

ఆ రోజు ఎంతలన్నీ చెప్పుకుంటూ తీరికగా ముగ్గురం భోం చేశాం

నేను, రాంబాబు బజార్లో వున్న కిళ్లీ షాపుదగ్గర నిలబడి సిగరెట్లు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నాం.

ఒక్కసారి ఎక్కడో కొంపలంటుకున్నట్లు గోల వినపడుతోంది. రోడమ్మట జనం పరగెడుతున్నారు.

మాకేమీ అర్థం కాలేదు.

ఎవర్నడిగినా ఎవరూ ఏమీ చెప్పడంలేదు.

అసలు గొడవేమిటో తెలియకుండానే వాళ్లంతా పరిగెడుతున్నారు.

వాళ్లతోబాటు మేమూ పరిగెత్తాం.

దారిలో ఒకతను చెప్పాడు

"నరసింహం గారింట్లో ఏదో హత్య జరిగిందట బాబూ" అని

నాకు నోటిమాట రాలేదు...

అయినా వాళ్ళతోబాటు పరిగెడుతూనే ఉన్నాను.

నరసింహంగారి ఇంటిముందు జనం గుమిగూడారు.

అక్కడున్నతన్ని మెల్లగా అడిగాను. "ఏం జరిగిందని ?"

"మాయదారి నరసింహం తనకు ఓటెయ్యలేదని పెళ్ళాన్ని పొడిచేసాడు" అన్నాడు

కంగారుగా జనాన్ని తోసుకుని ముందువాలోకి వెళ్ళాను.

అక్కడ నేలమీద మీనాక్షమ్మగారి శవం రక్తం మడుగులో పడివుంది.

అంతకు కొన్ని గంటల క్రితమే రూపాయకాసంత కుంకుంబొట్టుతో వున్న ఆమెను ఆ దారుణమైన స్థితిలో చూసే సరికి గుండె ఆగినట్లనిపించింది.

నరసింహంగారి పదహారేళ్ళకూతురు స్వరాజ్యం తల్లి శవం మీదపడి దీనంగా ఘోరంగా ఏడుస్తుంది. ఆమె ఏడుపు గాలిని, ధూళిని ఆకాశాన్ని భూమిని తాకుతోంది-ఆమె తల్లిని తప్ప.

ఇంతలో విజిల్స్ వేసుకుంటూ పోలీసులొచ్చారు. ఇంట్లో కూర్చున్న నరసింహం చేతుల్కి బేడీలువేసి బైటకు తీసుకొచ్చారు.

బేడీలతో కూడా నరసింహం పులిలా నడుస్తున్నాడు. తల్లి శవం మీదపడి ఏడుస్తున్న స్వరాజ్యం చటుక్కునలేచి తండ్రి కాళ్ళను చుట్టేసింది. ఆమె ఏడుపుతో పిచ్చిదై పోతుందేమోనన్న సందేహం వచ్చింది నాకు.

ప్రజాస్వామ్య సిద్ధాంతాల కొరకు తన కిష్టం వచ్చిన వారికిఓటు చేసిన నేరానికి హత్యగావించబడిన తల్లికోసం-దౌర్జన్యానికి ప్రతీకగా బతుకుతూ రాజకీయాల కోసం హత్యచేసి జైలుకి వెడుతున్న తండ్రి కోసం.... ఇద్దరి కోసమూ ఏడుస్తోందామె...

బేడీల చేతుల్తోనే కూతుర్ని లేవతీశాడు. అమె నుదుటి మీద ముద్దు పెట్టుకుంటూ "ఏడవకే ఎర్రి ముఖమా! సింహాన్ని బోనులో పెట్టడం ఎవరి తరమే ? నాల్రోజుల్లో కేసు కొట్టించేసి బైటకు రానూ ?" అన్నాడు.

అంత బాధలోనూ నవ్వొచ్చింది నాకు...

నరసింహం నిశ్చలంగా వెళ్ళి పోలీసు జీపులో కూర్చున్నాడు...

మరో వీధిలో వెంకటరత్నం తాలూకు ఊరేగింపు నిశ్చలంగా.. సాగిపోతోంది. మీనాక్షిగారి శవం నిశ్చలంగా పడివుంది... ఓడిన వర్గం వాళ్ళు బాధలోనూ, నెగ్గిన వర్గం వాళ్ళు ఆనందంలోనూ నిశ్చలంగా తాగేస్తున్నారు.

-స్వరాజ్యం మాత్రం ఘోరంగా ఏడుస్తూనే వుంది.

'ఓటరూ ! వర్ధిల్లు !!.